**International Journal of Academic Research**
**ISSN: 2348-7666; Vol.3, Issue-1(1), January, 2016**
**Impact Factor: 3.075; Email: drtvramana@yahoo.co.in**

# గతితార్కిక భౌతిక వాదానికి ప్రతీక "మహా ప్రస్థానసం"

**డా॥ పులపర్తి శ్రీనివాసరావు**
ప్రాజెక్టు ఫెలో, తెలుగు శాఖ,
ఆంధ్ర విశ్వవిద్యాలయం
సెల్ : 9491265859

'ప్రోగ్రెసివ్ అనే ఇంగ్లీషు పదానికి అనువాదంగా ఆధునిక సాహిత్యంలో 'అభ్యుదయం' అనే మాటను ఉపయోగించడం జరుగుతోంది. అంతే కాకకుండా అభ్యుదయ సాహిత్యం, అభ్యుదయ కవిత్వం వంటి మాటలను, మార్క్సిస్టు సాహిత్యం, మార్క్సిస్టు కవిత్వం అను రూఢార్థాల్లో ప్రస్తుతం ప్రయోగిస్తున్నాం. తెలుగు సాహిత్యంలో, అభ్యుదయ కవిత్వానికి చాలా ప్రాధాన్యం ఉంది. ఇది 'మార్క్సిస్టు ఉద్యమంలో భాగంగారచించిన కవిత్వం' అనే అర్థంలో మనం స్వీకరిస్తున్నాం.

అభ్యుదయ కవిత్వంలో రెండు రకాల విధానాలు ఏక కాలంలో దర్శనమిస్తాయి.. పాశ్చాత్య ప్రభావం వల్ల తెలుగులోకి ప్రవేశించిన అభ్యుదయ కవిత్వం, ప్రజాకవులు ఏర్పరచిన అభ్యుదయ కవిత్వం. పాశ్చాత్య ప్రభావంతో తెలుగులోకి వచ్చిన కవిత్వాన్ని శ్రీశ్రీ, నారాయణబాబు వంటి వారు ఆహ్వానించి దానికి పట్టం కట్టారు. ఈ కాలంలో మరొక విధంగా అభ్యుదయ కవిత్వం కనబడుతుంది. అదేంటంటే, నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణా ఉద్యమ పోరాటంలో ఆవిర్భవించిన కవిత్వం. సుద్దాల హనుమంతు వంటి ప్రజాకవులు రచించి పాడిన పాటలు ఆధారంగా ఈ కవిత్వం ఉనికిని చాటుకుంది. అయితే పాశ్చాత్య ప్రభావంతో వచ్చిన అభ్యుదయ కవిత్వాన్ని మాత్రమే తెలుగులో ఆదరించడం జరిగింది. అలాగే తెలుగు కవిత్వాన్ని ప్రభావితం చేసి ఎందరో అభ్యుదయ తెలుగు కవులను సృష్టించి సాహిత్యానికి ఒక ఆధునిక మార్గాన్ని ఏర్పాటు చేసింది.

మార్క్సిస్టు దృక్పధానికి ప్రతీక అయిన అభ్యుదయ కవిత్వం ఒక సామాజిక ఉద్యమం. కార్ల్ మార్క్స్, ఫెడరిక్ ఎంగిల్స్ మొదలగు వారి రచనల స్ఫూర్తితో ఈ ఉద్యమం ఆవిర్భవించింది.

'గతి తార్కిక భౌతిక వాదం' అనేది అభ్యుదయ కవిత్వంలోని మౌలిక సిద్ధాంతం. చారిత్రక భౌతిక వాదం కూడా ఇందులో భాగమే. ఆర్థికంగా బలహీనమైన, బలమైన రెండు వర్గాల మధ్య భేదం, సంఘర్షణ పెరిగి చివరకు ఈ సంఘర్షణ విప్లవాత్మక పరిణామం ద్వారా శ్రామిక వర్గ విజయానికి దారితీస్తుంది. ఇలా ఏర్పడిన శ్రామిక వర్గ నియంతృత్వ

ప్రభుత్వాలు తరవాత రాజ్యాంగ వ్యవస్థతో పనిలేని కమ్యూనిష్టు సమాజం ఏర్పడుతుంది. మనకు పరిపూర్ణ సుఖాన్ని అందించడానికి ఈ సమాజం అన్ని విధాల ఉపయోగపడుతుంది. ఇది చారిత్రక భౌతిక వాదం. ఈ ప్రభావం ఎక్కువగా ఐరోపా దేశాలలో కనబడుతుంది. అయితే కార్ల్‌మార్క్స్ ఒకే తత్వంలోని పరస్పరం సంఘర్షించే రెండు అంశాల సంఘర్షణే పరిణామానికి మూల సూత్రం అనే 'గతితర్కిక' సిద్ధాంతాన్ని పదార్థంలోంచే చైతన్య ఆవిర్భవించిందన్న భౌతిక వాదాన్ని సమ్మిళితం చేసి తన సిద్ధాంతాన్ని రూపొందించాడు.

తెలుగులో అభ్యుదయ కవిత్వం తారాస్థాయికి చేరడానికి పునాదులు శ్రీశ్రీ ఆలోచనలు అని విమర్శకుల అభిప్రాయం. శ్రీశ్రీ 'మహాప్రస్థానం', 'ఆధునిక భగవద్గీత'గా చైతన్య శిల్పిగా దర్శనమిస్తుంది. మహా ప్రస్థానంలో మార్కిస్టు భావజాలాన్ని పరిశీలిస్తే శ్రీశ్రీ కలగన్న సమాజం, సమాజ విధానం బయటపడుతుంది.

శ్రీశ్రీమహాప్రస్థానంలో గతితార్కిక భౌతికవాదంతో పాటు దాచినా దాగని సత్యాలు, వర్గసంఘర్షణ సిద్ధాంతం, శ్రామికుల సమిష్టి చైతన్యం శ్రామిక శక్తుల దోపిడీపై నిరసన, పాళితుల తిరుగుబాట్లు ఇలా అనేక కోణాలు ఉన్నాయి.

'దేశచరిత్రలు' గేయంలో గతితార్కిక భౌతిక వాదం నిలువునా బయటపడుతుంది.

*"ఏ దేశ చరిత్ర చూసినా*
*ఏమున్నది గర్వకారణం*
*నరజాతి చరిత్ర సమస్తం*
*పరపీడన పరాయణం"*

'ప్రతిజ్ఞ' ఖండికలో కార్మికుల శ్రమశక్తిని దోచుకునే పెట్టుబడీదారీ వ్యవస్థ తీవ్రంగా నిరశించి శ్రామిక వర్గ చైతన్యానికి పునాదులు వేసిన మార్క్సిస్టు దృక్పథం ప్రత్యక్షమౌతుంది.

*"వరాల వర్షం కురిపించాలని*
*ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని*
*గనిలో, పనిలో, కార్ఖానాలో*
*పరిక్లమిస్తూ*
*పరిప్లవిస్తూ"*

కార్లమార్క్స్ చెప్పిన గతితార్కిక భౌతికవాదమిదే. శ్రీశ్రీ మార్క్స్‌ను, అతని భావజాలాన్ని ఎక్కడా వదిలిపెట్టలేదు. శ్రామిక జీవులు - ధనిక స్వామికి దాస్యం చేస్తూ వారి చేతులోనే దోపిడీకి గురౌతున్నారని శ్రీశ్రీ తన మహాప్రస్థానంలో పేర్కొన్నాడు.

విరోధి వైరుధ్య సూత్రం ప్రకారం పెట్టుబడీదారీ వ్యవస్థ, కార్మిక వ్యవస్థల మధ్య సంఘర్షణ ఎప్పుడూ ఉంటుంది. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థలోని దోపిడీ విధానాన్ని నిర్మూలించడానికి శ్రామికులందరూ ఏకము కావాలని మార్క్స్ ప్రభోధించాడు. కానీ శ్రీశ్రీ అక్షరబద్ధం చేశాడు.

*"చీనాలో రిక్షావాలా*
*చెక్ దేశపు గని పనిమనిషి*
*ఐర్లాండున ఓడ కళాసీ అణగారిన ఆర్తులందరూ*
*హటెన్‌టాట్, జూలూ నీగ్రో*
*ఖండాంతర ఆనాజాతులు*
*చారిత్రిక యధార్థ తత్వం*
*చాటిస్తారొక గొంతుకతో"*

అని విశ్వ శ్రామికుల సమిష్టి చైతన్యం చేసిన అభ్యుదయ కవిగా శ్రీశ్రీ తన భావాన్ని వ్యక్తం చేశాడు. వ్యక్తుల ఇష్టానిష్టాలకు మార్క్సిజం అవకాశం ఇవ్వదు, ఆధారపడదు. అయితే వాటి వెనకున్న శక్తులను మాత్రమే పరిశీలిస్తుంది. అలా కాని పరిశీలనలన్నీ 'కట్టుకథలని' నమ్ముతుంది. శ్రీశ్రీ ఈ విషయాన్ని తీవ్రంగా వ్యక్తపరిచాడు.

*"ఇతిహాసపు చీకటికోణం*
*అట్టడుగున పడి కన్పించని*
*కథలన్నీ కావాలిపుడు*
*దాచేస్తే దాగని సత్యం"* అని హెచ్చరించాడు.

గతితార్కిక భౌతిక వాదానికి సంబంధించిన మరొక అంశం వర్గ సంఘర్షణ. ఈ వర్గ సంఘర్షణ సిద్ధాంతాన్ని అతిస్పష్టంగా సొంతగొంతుకతో స్వర కల్పన చేశాడు శ్రీశ్రీ. మానవ జాతి చరిత్రఅంతా వర్గ సంగర్షణ ఫలితమే అన్న గతి తార్కిక భౌతికవాద సిద్ధాంత ఫలితాన్ని శ్రీశ్రీ.. *"పరస్పర సంఘర్షించిన*
*శక్తులలో చరిత్ర పుట్టును"* అని సంగ్రహతనూ, సరళతనూ, గంభీరతనూ పుణికి పుచ్చుకున్న వాక్కులలో అందించాడు.

దోపిడీని ఎదిరించి కార్మికుల్లో వర్గ చైతన్యం పెల్లుబికి వారంతా సంఘటితులై పెట్టుబడిదారీ వర్గానికి విరుద్ధంగా వారి దోపిడీని ఎదురిస్తూ విప్లవాన్ని లేవదీస్తారని మార్క్స్ భావన. అందువల్లనే శ్రామిశక్తిని దోచుకుంటున్న వైనాన్ని తెలియజేశాడు.

*"ఘర్మజలానికి ధర్మ జలానికి*

*ఖరీదు కట్టే షరాబులేడోయ్"* అని నిర్వేదం ప్రకటించాడు. ఈ నిర్వేదంలో ఆశావాదం ఉదయించింది.

శ్రీశ్రీ మహాప్రస్థానంలో శ్రామిక వర్గ చైతన్యాన్ని అద్భుతంగా ..

*"నాలో కదిలే నవ్య కవిత్వం*

*కార్మిక లోకపు కళ్యాణానికి*

*శ్రామిక లోకపు సౌభాగ్యానికి"* సమర్పిస్తానని శపథం చేశాడు. అంతే కాకుండా.

*"కమ్మర కొలిమి కుమ్మరి చక్రం*

*జాలరి పగ్గం సాలెల మగ్గం*

*శరీర కష్టంస్ఫురింప చేసే*

*గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి*

*సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు*

సౌందర్యమనేది ఊహా కవిత్వ విషయమో, అతీంద్రియ స్వప్నమో కదాని, సమాజపు సుశిక్షితమైన గతిలోనే సౌందర్యం ఇమిడి ఉందని ఆ గతి శ్రమ ఫలితమే కనుక శ్రమే సౌందర్యమని మార్క్సిస్టు తత్వవేత్తలు వాదించాడు.

ఈ దృక్పథాన్నే శ్రీశ్రీ - "శ్రమైక జీవన సౌందర్యానికి

సమానమైనది లేనేలేదని" చెబుతూ "వ్యధార్థ జీవితయథార్థ దృశ్యం' పునాదిగా జనించబోయే భావి వేధాలకు జగత్తును అందిస్తానని ప్రతిజ్ఞ చేశాడు.

పాలితులుచేసిన తిరుగుబాటును శ్రీశ్రీ మహా ప్రస్తానంలో తీవ్రంగా వ్యంగ్యంగా రచన చేశాడు.

కనక దుర్గా చండసింహం జూలుదులిపి ఆవులించింది. ఇంద్ర దేవుని మదపుటేనుగు ఘీంకరిస్తూ సవాల్ చేసింది. అంటూ సవాళ్ళను, తిరుగుబాటును విప్లవానికి, విలయానికి ప్రతీకగా ప్రత్యక్షీపరింపచేశాడు శ్రీశ్రీ

*"పుడమి తల్లి నీ*

*పురిటి నొప్పులు*

*కొత్త సృష్టిని"* స్ఫురించాయని పెట్టుబడిదారీవ్యవస్థ విధ్వంసమై శిధిలమై శ్రామికవర్గం ఆవిర్భవిస్తుందన్న విషయాన్ని తెలియజేశాడు.

కవిత్వాన్ని ఒక సాధనంగా వాడుతూ శ్రీశ్రీ తన భావ వ్యక్తీకరణకు మరింత పదును పెట్టాడు. పాలక వర్గానికి, వ్యతిరేకంగా పాలితులనూ, పీడితులనూ నడిపించడానికి కవిత్వాన్ని మార్క్సిస్టులు ఒక సాధనంగా వాడుకున్నారు. అందుకే శ్రీశ్రీ కదిలేదీ కదిలించేదీ పెనునిద్దర వదిలించేది నవ కవిత అని అక్షరబద్ధం చేశాడు.

మార్క్సిస్టుల వాస్తవికతా వాదం కూడా గతాతార్కిక భౌతిక వాదంలోని భాగంగా దర్శనమిస్తుంది. కావ్య వస్తువులే వాస్తవికతా వాదం బోధిస్తుంది. స్వర్గం, నందనవనం మొదలైన అతీంద్రియ వస్తువులు, పూలు, సెలయేర్లు, మబ్బులు మొదలైన హృదయభరితమైన వస్తువులే కాకుండా జుగుప్సావహమైన అనుదాత్త వస్తువులను కూడా ఈ కోవలోకి చెందుతాయని అందుకే ..

*“కళ్లంటూ ఉంటే చూసి రాస్తే*
*అన్నీ ఆనందాయకాలే, రసమయాలే, కవితావేశాలే”*

అని విశ్వసించాడు. అంతేకాకుండా ... “కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిల్లా హీనంగా చూడకు దేన్నీ కవితా మయమేనోయ్ అన్నీ” అని ఉల్లేఖించాడు శ్రీశ్రీ.

ఇంకా ‘జగన్నాథుని రథచక్రాల్లో’ జగత్తులో జరుగుతున్న అన్యాయాలను అణచి వేయడానికి విప్లవ శక్తి అవతరిస్తుందని హెచ్చరించి పతితులకు, భ్రష్టులకు , బాధాసర్ప దష్టులకు దుర్దినాలు తొలగిపోవా; స్వాతంత్ర్యం, సౌహార్ధం, సమభావం, పునాదులుగా నూతనలోకం ఉదయిస్తుంది ఆశాసంగీతం ఆలపించాడు. ‘దేశచరిత్రలు” గేయం గతితార్కిక చారిత్ర భౌతిక వాదానికి ప్రతీకగా నిలుస్తుంది.

ఈ విధంగా గతితార్కి భౌతిక వాదం మహాప్రస్థాంలో నిక్షిప్తమై అభ్యుదయ భావజాలంతో బయటకు స్ఫురిస్తుంది. ఇతర దేశాలలో ప్రారంభమై భారత దేశంపై ప్రభావం చూపిన ఈ మార్క్సిస్టు దృక్పథాన్ని శ్రీశ్రీ తన రచనా దృక్పథాన్ని, ఆలోచననూ, భావ వ్యక్తికరణను జోడించి మహాప్రస్థానం రాసి ప్రజలకు అందించి అభ్యుదయ కాంక్షను చాటాడు.

The Author, Pulaparthi Srinivasa Rao, M.A. (Telugu) M.A (Public administration), Ph.D is the UGC Project fellow, Department of Telugu, Andhra University, Visakhapatnam. He obtained Ph.D award in Telugu from Andhra University, Visakhapatnam. He qualified for NET-JRF-SRF, A.P. SET. He has published more than 40 Research papers in various Journals, periodicals and seminar volumes. He wrote six books and he has been attended/ participated in several international and national Seminars and workshops.

